ముగిసిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 25: హుజూరాబాద్ మండలంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర విజయవంతంగా ముగిసింది. సోమవారం హుజూరాబాద్ పట్టణంతో పాటు మండలంలోని చిన్నపాపయ్యపల్లి, కాట్రపల్లి, ధర్మరాజుపల్లి, కనుకులగిద్ద, జూపాక, చెల్పూరు, బోత్తలపల్లి గ్రామాల్లో యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రజలకు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు హుజూరాబాద్ ఎస్‌బీఐ సీఎస్పీ పాయింట్ నిర్వాహకులు, కార్యక్రమం కోఆర్డినేటర్ కేశెట్టి విజయకుమార్, ఆస్మా తెలిపారు. చిన్న పాపయ్యపల్లి సర్పంచ్ జీ దేవేంద్ర, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ బలోపేతానికి సభ్యత్వాలు చేపట్టాలి

కార్పొరేషన్, డిసెంబర్ 25: ఉమ్మడి జిల్లాలో బీసీ ఉద్యోగుల సంఘం బలోపేతం కోసం పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేపట్టాలని రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి శ్రీనివాస్ యాదవ్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సంఘ భవనాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో బీసీ ఉద్యోగుల సంఘం పటిష్టం కాబోతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు బుర్ర సుధాకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు సుదర్శన్, ఉపాధ్యక్షుడు మురారి ప్రవీణ్, కార్యదర్శులు పూదరి రాజు గౌడ్, ప్రభాకర్, నాయకులు రమేశ్, రాజేశం, శ్రీనివాస్, పండుగ కృష్ణ, స్వామి, రమేశ్, సంపత్, శ్రీనివాస్, సుమన్ గౌడ్, రాజేశ్, వెంకటేశ్వర్, కిరణ్ పాల్గొన్నారు.

రెండో విడుత గొర్రెల పంపిణీ చేపట్టాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు రెండో విడుత గొర్రెల పంపిణీ చేపట్టాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్యయాదవ్ డిమాండ్ చేశారు. నగరంలోని యాదవ సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యాదవులకు గొర్రెలను పంపిణీ చేశారని పేర్కొన్నారు. రెండో విడుత గొర్రెల కోసం అప్పులు చేసి డీడీ కట్టామని తెలిపారు. కాలయాపన చేయకుండా రెండో విడుత గొర్రెల కొనుగోలు కోసం నగదు బదిలీ చేయాలని కోరారు.

రాష్ట్ర వైస్ చైర్మన్‌గా జక్కుల మల్లేశం గౌడ్

మల్లేశం గౌడ్

తెలంగాణచౌక్, డిసెంబర్ 25: ఆర్టీసీ కార్మిక సంఘం స్టాఫ్ అండ్ వర్కర్స్ (ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ) యూనియన్ రాష్ట్ర వైస్ చైర్మన్, ముఖ్యకార్యనిర్వాహకుడిగా జక్కుల మల్లేశం గౌడ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 22న జీఎం గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవ రెడ్డి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా నగరంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లేశం గౌడ్ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జనవరి 2న కరీంనగర్‌లో యూనియన్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, జక్కుల మల్లేశం గౌడ్‌కు కరీంనగర్ రీజియన్ అధ్యక్షుడు టీఆర్ రెడ్డి, కార్యదర్శి ఎన్‌కే రాజు శుభాకాంక్షలు తెలిపారు.

కరీంనగర్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల, మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు

హుజూరాబాద్‌టౌన్: కేక్ కట్ చేస్తున్న ఫాదర్ నెల్సన్, క్రైస్తవులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కరీంనగర్‌లోని చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

కమాన్ చౌరస్తా/ కరీంనగర్ రూరల్/ జమ్మికుంట/ ఇల్లందకుంట/ సైదాపూర్, శంకరపట్నం, హుజూరాబాద్‌టౌన్/ వీణవంక/ మానకొండూర్ రూరల్/ చిగురుమామిడి/ చొప్పదండి/ గంగాధర, డిసెంబర్25: జిల్లా వ్యాప్తంగా క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. నగరంలోని క్రిస్టియన్ కాలనీ సీఎస్ఐ సెంటినరీ వెస్లీ చర్చిలో పాస్టరేట్ చైర్మన్ ఎస్ జాన్ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి సందేశమిచ్చారు. ఏసు క్రీస్తు తన బోధనల ద్వారా సమాజ హితానికి పాటుపడ్డారన్నారు. ఆయన చూపిన బాటలో నడిచి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సూచించారు. అతిథులుగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక గీతాలు, ప్రార్థనలు అలరించాయి. కార్యదర్శి సీడీ నారాయణ, ట్రెజరర్ సీ సంజయ్‌కుమార్, సభ్యులు కరుణాకర్, వినయ్, సుమన్ పాల్గొన్నారు. విజయ్‌రఘునందన్ రోడ్డు సెయింట్ మార్క్ చర్చిలో జరిగిన వేడుకల్లో సాలీ ప్రభుదాస్ మెమోరియల్ ఆశ్రమ విద్యార్థులు, క్రైస్తవులు పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ నివాసం ఎదుట గల సీఎస్ఐ వెస్లీ కెథడ్రల్ చర్చిలో పాస్టరేట్ చైర్మన్ పాల్ కొమ్మాలు ప్రార్థన చేయించి సందేశమిచ్చారు. క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని సూచించారు. క్వాయర్ బృందం, యువతీ యువకులు, విద్యార్థుల గీతాలు అలరించాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రెస్బిటర్స్ మధుమోహన్, ప్రేంకుమార్, కార్యదర్శి దేవదాసు, కోశాధికారి నెల్సన్, కమిటీ సభ్యులు విజయారావు, సురేశ్, వినయ కుమార్, రవి, సాగర్, నికోలస్, జేకబ్, రేఖ, శోభ పాల్గొన్నారు. జ్యోతినగర్‌లోని లూర్ధుమాత చర్చిలో ఫాదర్ ఆర్ థామస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో చర్చి కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి, సభ్యులు గోపు రవి, ప్రదీప్, ఇన్నారెడ్డి, ప్రతాప్, బాల్‌రెడ్డి, రాజా పాల్గొన్నారు. జగిత్యాల రోడ్ బేతేలు చర్చిలో పాస్టర్ ప్రార్థనలు చేయించి సందేశమిచ్చారు. రేకుర్తిలోని కృప చర్చిలో పాస్టర్ ఎలీషా ప్రార్థనలు నిర్వహించారు. 19వ డివిజన్ కార్పొరేటర్ ఎదుళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు. వివిధ డివిజన్లు, మండలాలు, గ్రామాలతో పాటు క్రైస్తవుల గృహాల్లో ప్రార్థనలు, క్రీస్తు జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలోని బేతేలు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలకు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై, కేక్ కట్ చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. జమ్మికుంటలో జరిగిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుడు ప్రణవ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఇల్లందకుంట మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్కేపల్లిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని, క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను అందించారు. సర్పంచులు కొండ గణేశ్, కాయిత రాములు, తదితరులు పాల్గొన్నారు. శంకరపట్నం మండలంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దుస్తుల పంపిణీ, అన్నదానాలు నిర్వహించారు. హుజూరాబాద్ మండలం రంగాపూర్ కల్వరి టెంపుల్ చర్చిలో ఫాదర్ రెవడా. పీఆర్ నెల్సన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాటలు, యూత్ స్కిట్స్, నృత్యాలు అలరించాయి. వీణవంక మండలం ఘన్ముక్ల షారోను ప్రార్థనా మందిరంలో పాస్టర్ బండి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో 800 మందికి ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. హుజూరాబాద్‌లోని సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచారు. బిలీవర్, అగాపే చర్చి, ఎక్లేషియా మినిస్ట్రీస్ చర్చిల్లో పాస్టర్ డేవిడ్ రాజ్ తదితరులు ప్రార్థనలు నిర్వహించారు. కౌన్సిలర్లు సుశీలాసంజీవరావు, ములుగు సృజన-పూర్ణచందర్, ముక్క రమేశ్, బర్మావత్ యాదగిరి, కల్లెపల్లి రమాదేవి, ఉజ్మానూరిన్‌ఇమ్రాన్, సీఎస్ఐ సంఘ సెక్రటరీ సొల్లు బాబు, కోశాధికారి ప్రియాంక-శరణ్, సభ్యులు పాల్గొన్నారు. మానకొండూర్ మండలం కొండపల్కలలో పాస్టర్ జయరాజ్-భాగ్య, గంగిపల్లిలో పాస్టర్ ఆదినారాయణ, పోచంపల్లిలో పాస్టర్ అంజయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. చిగురుమామిడి మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థన చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఏసును ప్రార్థించారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని సీఎస్ఐ ఆల్ సెయింట్ చర్చిలో పాస్టర్ చైర్మన్ రెడ్డిమల్ల ప్రసాద్ దైవ సందేశాన్ని అందించారు. గంగాధర మండలంలోని చర్చిల్లో పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించి సందేశాన్నిచ్చారు. చొప్పదండిలోని హోలీషాలోమ్ చర్చి ఆవరణలో బిషప్ శాంతికుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ఔరంగజేబు అలైహి సందర్శన

కలెక్టరేట్, డిసెంబర్ 25: మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు అలైహిని ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు గులాం అహ్మద్ హుస్సేన్ సందర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఔరంగజేబు జీవిత చరిత్రను రాద్ధాంతం చేస్తూ, రాజకీయ లబ్ధి పొందేందుకు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా ఖుల్దాబాద్‌లో గల ఔరంగజేబు స్మారక కేంద్రం సందర్శిస్తే, వాస్తవాలు గ్రహించవచ్చన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్

తెలంగాణచౌక్, డిసెంబర్ 25: తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నాగారపు శ్రీనివాస్ నియమితులయ్యారు. కాగా, తన నియామకానికి సహకరించిన సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి శ్రీనివాస్‌యాదవ్‌కు నాగారపు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌ను బీసీ ఉద్యోగులు, సంఘం నాయకులు, సభ్యులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొత్తపల్లి, డిసెంబరు 25 : క్రీడలు శారీరక దారుఢ్యం పెంచి.. మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. సోమవారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరీంనగర్ ప్రీమియర్ లీగ్ టీ 10 సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, సెమీఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకొని సరదాగా క్రికెట్ ఆడారు. క్రికెట్‌లో ప్రతిభ చూపిన పలువురు క్రీడాకారులకు షీల్డులు అందజేశారు. మేయర్‌ను టోర్నమెంట్ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పలు జట్ల క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 25: మండల కేంద్రానికి చెందిన బొద్దుల రామవ్వ, గొల్ల మల్లయ్య, ఉండింటి రాజయ్య, పచ్చునూర్ గ్రామానికి చెందిన నేలవేణి మధునమ్మ, బీఆర్ఎస్ నాయకుడు నీలం అశోక్ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా, సోమవారం వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మానకొండూర్ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల మధు, బీఆర్ఎస్ నాయకులు ఉండింటి శ్యాంసన్, దండబోయిన శేఖర్, సందీప్, తదితరులు ఉన్నారు.

'ఎంపీ విమర్శలు అర్థరహితం'

కలెక్టరేట్, డిసెంబర్ 25 : తబ్లీగ్ జమాత్‌పై ఎంపీ బండి సంజయ్ చేస్తున్న విమర్శలు అర్థరహితమని ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. తబ్లీగ్ జమాత్‌కు సంబంధించిన ప్రతినిధులు కరోనా రావడానికి కారకులయ్యారని తప్పుడు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. 2020లో మీడియా ద్వారా జరిగిన ప్రచారంపై, న్యాయస్థానాలు తబ్లీగ్ జమాత్‌కు క్లీన్ చీట్ ఇచ్చాయని, అసత్య ప్రచారాలు చేసిన కొన్ని మీడియా సంస్థలు క్షమాపణలు చెప్పాయని గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి, హిందువుల ఓటు బ్యాంక్ కోసం బండి సంజయ్ తబ్లీగ్ జమాత్‌పై నిరాధారమైన ఆరోపణలు చేసి ప్రజల్లో అపోహలను సృష్టించడం మానుకోవాలని సూచించారు.

అపరభద్రాద్రిలో ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు

ఇల్లందకుంట, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ నమ్మాళ్వారుల పరమపద ఉత్సవం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇక్కడ దేవాలయ ఈవో కందుల సుధాకర్, అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరాచార్యులు, లోకాచార్యులు, దేవాలయ సిబ్బంది మోహన్, రాజన్న, భక్తులు ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


కనకయ్య(ఫైల్)

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 25: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ వేల్పుల కనకయ్య (55) గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కనకయ్య సోమవారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. హాజరు నమోదు సమయంలోనే తల తిప్పుతున్నట్లు అక్కడి సిబ్బంది, తోటి కూలీలకు చెప్పగా, వారు వెంటనే 108 వాహనం, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే కనకయ్య కన్నుమూశాడు. గుండెపోటుకు గురై కనకయ్య మృతిచెందినట్లు 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య ఓదెమ్మతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీలు మాయం

శంకరపట్నం, డిసెంబర్ 25: మండలంలోని తాడికల్ గ్రామంలో ట్రాక్టర్లలో బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు చామంతుల రాజు, పోలు శ్రీకాంత్, నామ్ కల్యాణ్, నెల్లి తిరుపతి, సుంకరి అనిల్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి ట్రాక్టర్ల బ్యాటరీలతో పాటు టూల్ బాక్స్‌లో గల స్పానర్స్ సెట్, డీజిల్, డెక్కులు, తదితర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ట్రాక్టర్ యజమానులు వెల్లడించారు.

చకిలం స్వప్నకు సత్కారం

విద్యానగర్, డిసెంబర్ 25 : ఏబీసీ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో భరత నాట్యం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రోగ్రాంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క మేము సైతం యువసేన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు చకిలం స్వప్నను సత్కరించారు. ఈ సందర్భంగా వారికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కేక్ కట్ చేసి.. స్వీట్లు పంచి

డిప్యూటీ మేయర్ స్వరూపారాణి-హరిశంకర్ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, తదితరులు

కార్పొరేషన్, డిసెంబర్ 25: నగరంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో వారు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. రాంనగర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ చల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి-హరిశంకర్ దంపతులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నగర మైనార్టీ అధ్యక్షుడు మీర్ సౌకత్ అలీ, ప్రధాన కార్యదర్శి వాజిద్ హుస్సేన్, నాయకులు నవాజ్ హుస్సేన్, సాయికృష్ణ, పల్లవి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఒడ్నాల రాజు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యో తల్లీ

- బిడ్డతో కలిసి బావిలో దూకిన మాతృమూర్తి
- కుటుంబ కలహాలతో ఆత్మహత్య
- ఒంటరైన కవల కొడుకులు
- చిగురుమామిడి మండలం రామంచలో విషాదం

అంజలి (ఫైల్)

తనుశ్రీ (ఫైల్)

చిగురుమామిడి, డిసెంబర్ 23: కుటుంబ కలహాలతో ఓ తల్లి కలత చెందింది. ఓ బిడ్డను తీసుకొని బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవడం కలిచివేసింది. దీంతో ఇద్దరు పిల్లలు రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. పోలీసుల వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలం రామంచకు చెందిన ములుపాల గగన్-అంజలి (30) దంపతులకు కవల పిల్లలు రేవంత్, రిశాంత్ (9), కూతురు తనుశ్రీ (6) ఉన్నారు. ఈ దంపతులు కొంత కాలం హైదరాబాద్‌లో ఉన్నారు. మూడేళ్ల క్రితం కరోనా టైంలో స్వగ్రామానికి వచ్చారు. అంజలి గృహిణి కాగా, గగన్ హార్వెస్టర్‌తోపాటు వరినాటు వేసే మిషన్ కొని గ్రామంలోనే వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. ఆదివారం రాత్రి పిల్లల విషయంలో దంపతుల మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో అంజలి మనస్తాపం చెందింది. సోమవారం తెల్లవారు జామున అలుక్కు పేడ తీసుకొస్తానని చెప్పి బిడ్డను తీసుకొని ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. గ్రామ శివారులోని బీరప్ప గుడి వద్ద బిడ్డతో కలిసి బావిలో దూకింది. తల్లీ బిడ్డలు తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు ఊరంతా గాలించారు. ఉదయం 11గంటల ప్రాంతంలో బీరప్ప గుడి వద్ద బావిలో శవమై కనిపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీసి కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అంజలి తల్లి ఓదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో మృతదేహాలను కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్ రావు, తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి పరిశీలించారు.

ఎన్సీఈఆర్టీకి బొమ్మనపల్లి వాసి ఎంపిక

చిగురుమామిడి, డిసెంబర్ 23: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన కంది సంపత్ ఎన్సీఈఆర్టీ (జాతీయ విద్య పరిశోధన మండలి)లో అధ్యయనానికి ఎంపికయ్యారు. ఆయన సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఢిల్లీలోని గైడెన్స్ కౌన్సెలింగ్ విభాగంలో ఏడాదిపాటు అధ్యయనం చేయనున్నారు.

అయ్యప్ప పడిపూజకు మాజీ ఎమ్మెల్యే హాజరు


మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను సన్మానిస్తున్న శ్రీనివాసరావు

గంగాధర, డిసెంబర్ 25 : గర్శకుర్తిలో మాజీ సర్పంచ్ కల్వకోట సవితాదేవి-శ్రీనివాసరావు నివాసంలో సోమవారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. కాగా, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, సర్పంచులు శ్రీమల్ల మేఘరాజు, ముక్కెర మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలును తనిఖీ చేసిన డీఐజీ

రాంనగర్, డిసెంబర్ 25 : కరీంనగర్ జిల్లా జైలును వరంగల్ రేంజ్ జైళ్ల శాఖ డీఐజీ సంపత్ సోమవారం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన ముందుగా జైలు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. జైలులో ఉన్న ఖైదీల యోగ క్షేమాలు, భోజన వసతులు, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కరోనా తిరిగి వ్యాప్తి చెందుతుండడంతో జైలులో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో నిర్వహిస్తున్న క్యాంటీన్, దవాఖాన, ములాఖత్, ఫోన్ సౌకర్యం, జైలు ఇండస్ట్రీ, పెట్రోల్ బంకులో పనితీరును పరిశీలించి అధికారులను అభినందించారు. అనంతరం వివిధ విభాగాల్లోని రికార్డులను పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ సమ్మయ్య, వైద్యాధికారి వేణు, జైలర్ శ్రీనివాస్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు నిధుల విడుదల

కార్పొరేషన్, డిసెంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28 నుంచి చేపట్టనున్న ప్రజా పాలనకు సంబంధించి నిధులను విడుదల చేసింది. ఈ మేరకు మున్సిపాలిటీల్లో ప్రతి వార్డు, డివిజన్‌కు రూ. 10 వేల చొప్పున ఖర్చుల కోసం కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కరీంనగర్‌లోని 60 డివిజన్లు, చొప్పదండి, కొత్తపల్లి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లోని 85 వార్డులకు సంబంధించి పది వేల చొప్పున విడుదల చేశారు.

ప్రైవేట్ దవాఖాన నిర్వాకం..
యువతికి మూడు నెలలుగా నరకం

రాంనగర్, డిసెంబర్ 25: డెలివరీ కోసం ప్రైవేట్ దవాఖానకు వెళ్తే కనీసం చట్టాన్ని పరిరక్షించే కానిస్టేబుల్ అని కూడా చూడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆమెను చావు అంచుల దాకా తీసుకెళ్లిన ఘటన కరీంనగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. పూర్తి వివరాలు.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌పేటకు చెందిన యువతి ప్రస్తుతం పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నది. మూడు నెలల క్రితం డెలివరీ కోసం నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరింది. నిర్వాహకులు నార్మల్ డెలివరీ చేసి కుట్లు సరిగ్గా వేయక డిశ్చార్జ్ చేశారు. పది రోజుల తర్వాత నొప్పి రావడంతో తిరిగి హాస్పిటల్‌కి వెళ్లగా, బ్యాండేజ్ మర్చిపోవడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా దానిని తొలగించి ఇంటికి పంపించారు. తిరిగి 15 రోజులకు అస్వస్థతకు గురి కావడంతో మరో ప్రైవేట్ దవాఖానకు వెళ్లగా విషయం వెలుగు చూసింది. 15 రోజులుగా దవాఖానలో చికిత్స పొందిన ఆ మహిళ ఇప్పుడిప్పుడే కోలుకుంటూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నది. అయితే తన కూతురికి వైద్యం చేయడంలో నిర్లక్ష్యం వహించి ఆమెను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన ప్రైవేటు దవాఖానపై చర్యలు తీసుకోవాలని సదరు కానిస్టేబుల్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు రూరల్ సీఐ ప్రదీప్ తెలిపారు.

వాసవీ మాతకు లక్ష పసుపు కొమ్ములతో పూజలు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్25: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతకు లక్ష పసుపు కొమ్ముల పూజ, కుంకుమార్చన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం హుజూరాబాద్‌లోని వైశ్య మహిళా భక్తులు లక్ష పసుపు కొమ్ముల వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ కటకం శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

చొప్పదండి, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని వేంకటేశ్వర-మణికంఠ ఆలయ అభివృద్ధికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి రూ. 51,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్, గౌరవాధ్యక్షుడు గొల్లపల్లి శ్రావణ్ కుమార్, వేంసాని రవీందర్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న నగునూరి రాజేందర్

విద్యానగర్, డిసెంబర్ 25: కరీంనగర్ పట్టణ ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం స్థానిక వైశ్య భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, జిల్లా అధ్యక్షుడు చందా రాజు, రాష్ట్ర మహిళా అధ్యకురాలు ఉప్పల శారద, కాచం సుష్మ, కల్వ సుజాత హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా నగునూరి రాజేందర్, యువజన, మహిళా విభాగాల కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ, ఆర్య వైశ్య కార్పొరేషన్‌ను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్య వైశ్య మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రముఖులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాథుని శ్రీనివాస్, వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రాచమల్ల ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు ఏవీ మల్లికార్జున్, నాగమల్ల మధుసూదన్, కొండూరి సత్యనారాయణ, పెద్ది రామన్న, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు ఎలగందుల మునీందర్, వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేశ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు జైన అర్చన, యువజన అధ్యక్షుడు తనుకు సాయికృష్ణ, మహిళా అధ్యక్షురాలు రావికంటి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాల్, కోశాధికారి సుద్దాల వెంకటేశ్, మారుతి, వెంకటరమణ, హరి, నవీన్, ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'రైతు బంధు నిధులు విడుదల చేయాలి'

తెలంగాణచౌక్, డిసెంబర్25: రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు నిధులను విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం (ముకుందలాల్ మిశ్రా భవనం)లో సోమవారం ఆయన మాట్లాడారు. నగర కార్యదర్శి గుడికందుల సత్యం, బీమాసాహెబ్, సంపత్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

చొప్పదండి, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని దుర్గాదేవీ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, దాతలను ఆలయ నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చీకట్ల లచ్చయ్య, నలుమాచు రామకృష్ణ, గంగయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రానికి ఆర్థిక సాయం

ఇంద్రానికి చెక్కు అందజేస్తున్న సంఘం బాధ్యులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 25 : సామాజిక పరివర్తన దినోత్సవం సందర్భంగా ఎరుకల(కుర్రు) ఉద్యోగుల సంఘం 7వ వార్షికోత్సవం సోమవారం జిల్లా కేంద్రంలోని కృషి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుకల లిపి కోసం కృషి చేస్తున్న ఇంద్రానికి రూ. 10,116 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మొగిలి లచ్చయ్య, నాయకులు ఒలుగుత్తుల పోచయ్య, మొగిలి బుచ్చయ్య, కేవై ప్రసాద్, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

డేకేర్ సెంటర్ సందర్శన

కలెక్టరేట్, డిసెంబర్ 25: అస్తానా గుల్షన్ ఏ సూఫీ పీఠాధిపతి హజ్రత్‌సూఫీ సయ్యద్ జమాలుద్దీన్ షా ఖాద్రీ చిస్తీ నగరంలోని వయోవృద్ధుల డేకేర్ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. డేకేర్ సెంటర్ నిర్వాహకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డేకేర్ సెంటర్‌లో వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, అభినందించారు. కార్యక్రమంలో డేకేర్ సెంటర్ అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు, సంస్థ ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, సహాయకార్యదర్శి రాపోలు శ్రీధర్‌స్వామి, కోశాధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

చొప్పదండి, డిసెంబర్ 25: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు సన్‌రైజ్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు తైక్వాండో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొంతుల మనోహర్ తెలిపారు. విద్యార్థులు సమీక్ష, లాస్యప్రియ, మదీహ నాసిర్, రమ్యను మనోహర్‌తో పాటు ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శ్రీగాధ సంతోష్, నేవూరి సతీశ్ అభినందించారు.

నాట్య ప్రదర్శనలో చిన్నారి ప్రతిభ

వీణవంక, డిసెంబర్ 25: మండల కేంద్రానికి చెందిన బత్తిని సహస్ర ఈ నెల 24న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆరు వేల మంది కళాకారులతో కలిసి జనుత శబ్దం అంశంపై ఏడు నిమిషాల పాటు నాన్‌స్టాప్‌గా ప్రదర్శన ఇచ్చి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు సంపాదించింది. ఈ సందర్భంగా మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

సింగిల్‌విండో చైర్మన్ పరామర్శ

రామడుగు (చొప్పదండి), డిసెంబర్ 25: రామడుగు మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన దైవాల అఖిల్‌గౌడ్ మృతి చెందగా, సోమవారం బాధిత కుటుంబసభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు పరామర్శించారు. అఖిల్ గౌడ్ మృతికి కారణాలను అడిగి తెలుసుకొని, సంతాపం వ్యక్తం చేశారు.